నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా 11 కేవీ రవీంద్రనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మహేశ్వరినగర్, జేఎస్ఎస్ కాలనీ, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ తెలిపారు.

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. హకీంపేట సబ్‌స్టేషన్ 11కేవీ రిసాలబజార్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిసాలబజార్, ప్రేమ్‌నగర్, జీఎస్ఆర్ ఎన్‌క్లేవ్, బంజారా విలేజ్, కుటియామందిర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, భూదేవినగర్ సబ్‌స్టేషన్ 11కేవీ ఆదర్శనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదర్శనగర్, వైష్ణవి మాత టెంపుల్, ఈస్ట్ వెంకటాపురం, ఎంఈఎస్ కాలనీ, ఎస్ఏవో నారాయణపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ బొడిగె స్వాతికృష్ణగౌడ్‌కు న్యూలైఫ్ తీయాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కరోనా సమయంలో సాయం, వరద బాధితులకు అందించిన సేవలను గుర్తించి సోమవారం రవీంద్ర భారతిలో యూనివర్సిటీ నిర్వాహకులు డాక్టరేట్‌ను అందజేశారు.

స్టేషనరీ సామగ్రి అందజేత

మల్లాపూర్: జీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మల్లాపూర్ సూర్యనగర్ ప్రాథమిక పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు స్టేషనరీ సామగ్రిని ఫౌండేషన్ చైర్మన్ గూడూరు శైలేష్‌రెడ్డి అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, జీఎస్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: వెంకటరమణ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఆయనకు వెంకటరమణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రోడ్లు, హైమాక్స్, వీధి లైట్లు, పార్కుల అభివృద్ధిపై వినతిపత్రం అందజేశారు. హరీశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాంచందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరేశ్, కోశాధికారి వెంకటేష్, సంయుక్త కార్యదర్శి శివకుమార్, సృజన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉపేందర్, వాసుగౌడ్ తదితరులున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు చెక్కును ప్రదానం చేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : చిన్నచెరువు గ్రౌండ్‌లో గత మూడు రోజులుగా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఫీక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంపీఆర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో గెలిచిన జట్లకు రూ.15 వేలు, రూ.7,500 లు ఉప్పల్ నియోజకవర్గం రెండో బహుమతి ప్రదానం చేసి, నిర్వాహకులను ఆయన అభినందించారు. టీపీసీసీ ప్రతినిధి తౌఫిక్, సందీప్, అరుణ్, ఉదయ్, వజీర్, అశోక్, సంధ్యారాణి, గాయత్రి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



డీసీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శాంతి, కాలనీవాసులు

అల్వాల్: డివిజన్‌లోని సమస్యలపై పలు కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి సోమవారం డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన వారికి అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నాయకులు యాదగిరిగౌడ్, శరణ్‌గిరి, ప్రేమ్ కుమార్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వ్యాపార సముదాయాలు



హెచ్‌బీకాలనీ మోడల్ మార్కెట్



ఏళ్లుగా నిరుపయోగంగానే..

- హెచ్‌బీకాలనీ మోడల్ మార్కెట్
- అనువైన ప్రాంతం కాదంటున్న వ్యాపారులు
- అధికారుల అనాలోచిత నిర్ణయాలతోనే ఖాళీగా..
- 2018లో రూ.50 లక్షలతో నిర్మాణం

చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించాలనే ఆశయంతో నిర్మించిన జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. వ్యాపారాలకు అనువుగా లేకపోవడంతో అనాసక్తి చూపుతున్నారు. దీంతో మార్కెట్‌లోని వ్యాపార సముదాయాలు ఏడేళ్లుగా ఖాళీగానే ఉంటున్నాయి. – కుషాయిగూడ

ఏడేళ్లుగా నిరుపయోగంగా..

రూ.50 లక్షలతో మీర్‌పేట్, హెచ్‌బీకాలనీ డివిజన్, హెచ్‌బీకాలనీ ఫేస్–1 జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్‌ను 2018లో నిర్మించారు. 14 వ్యాపార సముదాయాలతో అప్పటి మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రాంమ్మోహన్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. టెండర్‌లో వ్యాపార సముదాయాలు దక్కించుకున్న వారు 6 నెలల అద్దె చెల్లించి మరీ ఉత్సాహంగా అగ్రిమెంట్లు చేసుకున్నారు. వారిలో కొంతమంది చిన్న చిన్న వ్యాపారాలు కూడా మొదలు పెట్టారు. కానీ ఆశించిన రీతిలో వ్యాపారాలు సాగకపోవడంతో అద్దె చెల్లించలేక కొద్దిరోజులకే వ్యాపారాలను ఎత్తేశారు.

అనువుగా లేదంటున్న వ్యాపారులు..

హెచ్‌బీకాలనీ ఫేస్–1లో నిర్మించిన మోడల్ మార్కెట్ వ్యాపారానికి అనువుగా లేదని వ్యాపారులు చెబుతున్నారు. కాలనీలో మోడల్ మార్కెట్ ఉన్న విషయం ఆ కాలనీవాసులకే తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజా ప్రతినిధులు, అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్లే మోడల్ మార్కెట్‌కు ఈ పరిస్థితి వచ్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మందుబాబులకు అడ్డా..

మార్కెట్ ఖాళీగా ఉండటంతో రాత్రి వేళల్లో మందుబాబులు తిష్ట వేస్తున్నారు. మార్కెట్ పరిసరాలను పూర్తిగా అపరిశుభ్రంగా మార్చేశారని స్థానిక కాలనీవాసులు వాపోతున్నారు.

తాజాగా టెండర్లు..

అద్దె చెల్లించని వ్యాపారులకు నోటీసుల జారీ చేసినా స్పందించలేదు. దీంతో తాజాగా రెండు నెలల క్రితం తిరిగి టెండర్లు వేశారు. దుకాణాలు దక్కించుకున్న వారి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని ఇంజినీరింగ్ డీఈ రూప తెలిపారు.

మార్కెట్‌కు గుర్తింపు తీసుకురావాలి



అనాలోచిత నిర్ణయాలతో మోడల్ మార్కెట్ నిర్మించి నిరుపయోగంగా మార్చారు. అనువైన స్థలం కాకపోవడంతో వ్యాపారులు మార్కెట్‌పై శ్రద్ధ చూపడం లేదు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపి వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించి మోడల్ మార్కెట్‌కు గుర్తింపు తీసుకురావాలి.

– మునుగంటి రాంప్రదీప్, బీజేపీ నేత

3న ఎమ్మార్పీఎస్ సన్నాహక సమావేశం



మల్లాపూర్: 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ పోరాటానికి ఫిబ్రవరి 7న జరిగే 'లక్షల డప్పులు వేల గొంతులు' భారీ సాంస్కృతిక ప్రదర్శన విజయవంతం చేయాలని కోరుతూ ఫిబ్రవరి 3న నాచారం సీకె గార్డెన్‌లో జరిగే సమావేశాన్ని నిర్వహిస్తున్నామని నాచారం ఎమ్మార్పీస్ నేతలు తెలిపారు. ఈ సమావేశానికి మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు సమాచారం.

గొలుసు దొంగతనానికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

మల్లాపూర్: గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని నాచారం పోలీ సులు సోమవారం అరెస్ట్ చేశారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్విర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌ఎంటీనగర్ స్ట్రీట్ నెంబర్–3లోని క్రిష్ణమూర్తి రెసిడెన్సీలో నివాసం ఉండే తోట కనకమహాలక్ష్మి 21న రేషన్‌కార్డు దరఖాస్తుకు సాయం చేస్తానని రాజ్‌కుమార్(25) నమ్మించి తన పేరు రమేష్ అని పరిచయం చేసుకున్నాడు. ఎవ్వరూ లేని సమయంలో బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి 11 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సోమవారం అతడిని అదుపులోకి తీసుకుని గొలుసుతో పాటు బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

మద్యం మత్తులో కారుతో ఢీ..

– పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



కుషాయిగూడ: మద్యం మత్తులో ఓ వ్యక్తి ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టిన ఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. వివరాల ప్రకారం.. మేడిపల్లి పీఎన్‌టీ కాలనీలో నివసించే భూక్యా నెహ్రూ క్యాబ్‌ను అద్దెకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున కుషాయిగూడలో ప్యాసింజర్‌ను ఎక్కించుకుని వెళ్తుండగా.. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన (టీఎస్36టీ 7871) కారు ఢీకొట్టడంతో క్యాబ్ డివైడర్‌కు తగిలి ముందుభాగం దెబ్బతింది. దీంతో బాధితుడు కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా కారులో ఉన్న వ్యక్తి మౌలాలికి చెందిన శ్రీధర్ అని, అతడితో పాటు మరో వ్యక్తి కూడా కారులో ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి..

– దాడికి పాల్పడిన వారిపై కేసు

మేడిపల్లి: అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఓ వ్యక్తిని దుర్భాషలాడుతూ దాడికి పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ గౌతమ్‌నగర్‌కు చెందిన కె.మల్లారెడ్డి సర్వేనెంబర్ 63/28లో సిమెంటు రేకుల షెడ్డును ఏర్పాటు చేసుకుని కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. కాగా ఈనెల 25న రాత్రి 7.30గంటల సమయంలో స్థానికంగా ఉంటున్న శశి, జొన్న రాజు, శ్రీనివాస్ రెడ్డి, రాజు, వేణు కొంతమందితో కలిసి అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దుర్భాషలాడుతూ.. సదరు ఇంటి యజమానిపై దాడికి పాల్పడ్డారు. విద్యుత్ మీటర్, దుస్తులకు నిప్పంటించడంతో ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. బాధితుడు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవంబర్‌లోగా హైవే పనులు పూర్తి చేయాలి

మేడ్చల్: నగరంలోని బోయిన్‌పల్లి నుంచి మెదక్ జిల్లా కాళ్లకల్ వరకు చేపట్టిన 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు వచ్చే నవంబర్‌లోగా పూర్తి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అధికారులు, బీజేపీ నాయకులతో కలిసి మేడ్చల్ పరిధిలో విస్తరణ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. రోడ్డు విస్తరణతో వాహనదారులు ఇబ్బందులు పడకుండా కాంట్రాక్టర్, అధికారులతో కలిసి పని చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పోలీసులు చూడాలని సూచించారు. వాహనదారుల ఇబ్బందులు తొలగించేందుకే కేంద్ర ప్రభుత్వం రూ.1000 కోట్ల నిధులతో జాతీయ రహదారి విస్తరణ, అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, శైలజ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

తహసీల్దార్‌కు వినతిపత్రం

కీసర: సీపీఎస్‌కు బదులుగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూనైటెడ్ పెన్షన్ స్కీమ్ యూపీఎస్ (గెజిట్ విడుదల)ను వ్యతిరేకిస్తూ సోమవారం భోజన విరామ సమయంలో పీఆర్టీయూ టీఎస్ కీసర మండలాధ్యక్షుడు చీర యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీగా వెళ్లి కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర బాధ్యులు వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, కె.శ్రీనివాసులు, తిరుమల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జ్యోత్స్న, శశిరేఖ, కొండల్, ముత్యం, వెంకటరమణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా ఏడీఎంఏ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 26న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గ పదవీకాలం ముగిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మాట్లాడుతూ.. అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మల్లాపూర్: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్వేచ్ఛ సంస్థ వ్యవస్థాపకురాలు నిక్షిప్తరెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్‌ను అందజేశారు. అనంతరం ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ.. శ్రద్ధ వహించాలని సూచించారు. స్వేచ్ఛ సంస్థ ప్రతినిధులు వాణి, సాయికుమార్, మహిరా సాధ్వి, ప్రధానోపాధ్యాయులు యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యం



మల్లాపూర్: మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో జీఎస్ ఫిట్‌నెస్ స్టూడియో గౌతమ్, అభిఫిట్‌నెస్ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ హాజరై విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు సత్కారం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3వ డివిజన్ కార్పొరేటర్ శారదాఈశ్వర్‌రెడ్డి పదవీ కాలం ముగిసింది. ఈ సందర్భంగా సోమవారం కాలనీవాసులు, సెటిల్ గ్రూప్ సభ్యులు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. సెటిల్ సభ్యులు రంగారెడ్డి, భాస్కర్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాస శివరాత్రి పూజలు

గౌతంనగర్: మాసశివరాత్రి పురస్కరించుకుని గౌతంనగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్‌లో శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో నిర్వాహకులు నాగరాజు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం స్ఫటిక లింగానికి విశేష ద్రవ్యాల అభిషేకం, రుద్రహోమం నిర్వహించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మల్కాజిగిరి: దివ్యాంగుల హక్కుల సాధనకు 10న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మేడ్చల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం సర్కిల్ కార్యాలయం వద్ద కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సన్యాసినాయుడు, నర్సింహ, వీరప్ప, ఈశ్వరయ్య, మోసెస్ పాల్గొన్నారు.

కాలనీల సమస్యలు పరిష్కరించాలి

అల్వాల్: నార్త్ అల్వాల్‌లోని 20 కాలనీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నార్త్ అల్వాల్ అసోసియేషన్ ప్రతినిధులు అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో డీసీకి వినతిపత్రం అందజేశారు. అల్వాల్ ఐజీ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఐజీ సర్కిల్ నుంచి లయోలా కళాశాల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి, ఆక్రమణలను తొలగించాలన్నారు. వి.మహేందర్‌రెడ్డి, జి.మహేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, బుచ్చిరెడ్డి, విఠల్, ఇంద్రారెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రావు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అల్వాల్ డీసీకి వినతిపత్రం ఇస్తున్న నార్త్ అల్వాల్ అసోసియేషన్ ప్రతినిధులు

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి



సమావేశంలో దళితసంఘాలు, బీఆర్ఎస్ నేతలు

అల్వాల్/మల్కాజిగిరి: నియోజకవర్గంలో షెడ్యూల్డ్ కులాల వారికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ పెట్టిన కేసుల పురోగతిలో జరుగుతున్న జాప్యాన్ని అరికట్టాలని దళిత సంఘాలు, బీఆర్ఎస్ నేతలు ఆర్డీఓ శ్యామ్‌ప్రకాష్‌ను కోరారు. సోమవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఆర్డీఓ అధ్యక్షతన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నేరేడ్‌మెట్‌లో జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అల్వాల్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ కరమ్‌చంద్‌పై జరిగిన దాడి కేసులో ఆధారాలు లేవని పోలీసులు కేసును ప్రక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థికసాయంలో జాప్యం జరుగుతోందని దాన్ని అరికట్టాలన్నారు. దళితులకు కులధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేస్తున్నారని, ఆరో మాల కులస్తులకు త్వరితగతిన సర్టిఫికెట్లు అందేలా చూడాలన్నారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకటేష్, అశోక్, రాములు, స్థానిక నేతలు అంజయ్య, కరమ్‌చంద్, జగదీష్‌గౌడ్, గంగాధర్‌కృష్ణ, గణేష్, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల సమస్యలు పరిష్కరించాలని..

కాలనీవాసుల ఆందోళన, వినతి

కాప్రా: గత కొన్ని నెలలుగా కాప్రా సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్లపల్లి కాలనీస్ కో– ఆర్డినేషన్ కమిటీ సీసీఎస్ ఆందోళన చేపట్టింది. వీధి దీపాలు, రోడ్ల మరమ్మతులు, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరించాలని కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీసీఎస్ ప్రెసిడెంట్ ఎంపల్లి పద్మారెడ్డి మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా కాలనీల్లో వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక సమస్యలు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ జగన్‌కు వినతిపత్రం అందజేశారు. సీసీఎస్ ఉపాధ్యక్షుడు మురళి పంతులు, వివిధ కాలనీల ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, రవి, కృష్ణ, శ్రీనివాస్‌నాయక్, నర్సింహారెడ్డి, తిరుమల్‌రెడ్డి, కిషోర్, నరేష్, వీరబ్రహ్మం, రమణ, సుధాకర్, కాటేపల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్ జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ప్రజావాణిలో 5 ఫిర్యాదులు



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి 5 ఫిర్యాదులు అందాయని డీసీ రాజు అన్నారు. ప్రజావాణిలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో దోమల బెడద అధికంగా ఉందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు జారీ చేయాలన్నారు. చాలామంది అర్హుల వివరాలు నమోదు కాకపోవడంతో వారు ఏ పథకానికి అర్హులో తెలుసుకునేందుకు కష్టంగా మారిందన్నారు. ఎడిట్ ఆప్షన్ ద్వారా వారికి న్యాయం చేయాలన్నారు.

కార్పొరేషన్ల స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



మేడిపల్లి: మున్సిపాలిటీల పాలక వర్గం పదవీ కాలం ఈనెల 26తో ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం (ఏడీఎంఏ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్) పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్‌గా ఎస్.శ్రీనివాస్‌రెడ్డిని నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్లు త్రిలేశ్వర్‌రావు, రామలింగం, కె.వీరారెడ్డి, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

- పొంగుతున్న మురుగు నీరు
- తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు

బోడుప్పల్: చెంగిచర్ల 3వ డివిజన్ పరిధిలో శ్రీసాయి రెసిడెన్సీ కాలనీలోని రోడ్డు నెంబర్ 7 ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పైకప్పు ధ్వంసమైంది. రద్దీ రహదారి కావడంతో గమనించిన స్థానికులు మ్యాన్‌హోల్‌పై ప్రమాద సూచికగా కట్టె పెట్టి చుట్టూరా ఇటుకలు పెట్టారు. దీనిపై అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కట్టెతో ప్రమాద సూచిక తెలుపుతూ..

పొంగుతున్న మురుగుతో దుర్వాసన..

రామంతాపూర్ : కేసీఆర్‌నగర్ నుంచి నాగోల్ మెట్రోస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి సర్వీస్ రోడ్డుపై శ్రీరామకాలనీ వద్ద గత రెండు నెలలుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పొంగిపొర్లుతూ రోడ్డు చిన్న కుంటలా మారిపోయిందని, దీంతో మురుగునీరు వెదజల్లి దుర్వాసన భరించలేకపోతున్నామని, ప్రధాన రహదారి కావడంతో రోజుకు వందలాది వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించకుంటే స్థానికులతో కలిసి ధర్నాకు దిగుతామని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ హెచ్చరించారు.



పొంగుతున్న డ్రైనేజీ నీరు